కథకు ప్రాసిక్యూషన్ వారు ఆరోపిస్తున్న ఆరోపణలేవీ నేరాలుగా నాకు కనిపించడం లేదు కాగా, నత్తనడకతో నడుస్తున్న సంసారాలు కొన్ని ఈ కథ వల్ల జెట్ స్పీడందుకున్న దాఖలాలు నా దృష్టికి వచ్చాయి పోతే, ప్రాసిక్యూషన్వారి దృష్టికిరాని, అశ్లీలం కాని అశ్లీలమైన పాయింటొకటి ఇక్కడ ముఖ్యమైనది. ఏ భార్యఅయినా తన భర్తని 'రా' అని పిలిచిందంటే వారిద్దరి మధ్య అన్యోన్యత గాఢంగా ఉందని అర్థం ఈ కథలో భార్యచేత 'చంపకు-రా' అని రచయిత అనిపించడం, పవిత్రమైన ఆ గాఢతను సూచించడమే! ఇది పైకి అశ్లీలతగా కనుపించినప్పటికీ అశ్లీలత కాదు సరిగదా, పరిణతి చెందిన శృంగారం! సంసారం చెయ్యటంలో కొంతదూరం సాగినవారు- అంటే పాతిక ముప్పయ్యేళ్ళు వయసు దాటిన వాళ్ళు మాత్రమే అసంకల్పితంగా ప్రదర్శించే శృంగారం! అందుచేత పెళ్ళి కాని యువతీ యువకులకు ఇది అర్థం అవుతుందని కానీ, ఈ కథ వల్ల యువత పెడత్రోవ పడుతుందని కానీ నేననుకోను... ఈ కారణాల వల్ల కేసును కొట్టేస్తున్నాను...

" అయితే ఆ 'రా' ను తీసేసి 'ఇస్స్ , అబ్బా చంపకు!' అని ఆపేస్తే ఆమె తన భర్తతో ' ఇంటి పని ఇంత చేసొచ్చాను. ఇంకా తమలపాకుల పని చెబుతావా?' అని విసుక్కుంటున్నట్లు సమర్థించుకోవచ్చు. ఇది అందరికీ అర్థమయ్యేభాష . కథ ఇంకా బాగుండే భాష కనక ఆ 'రా' ను తీసేయమని రచయితకీ, ఆ విధంగా ప్రకటించమని ఎడిటర్‌కీ సూచిస్తున్నాను."

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 28-6-89)

★★★ ★★★ ★★★

# శక్తి

నరసాపురం నుంచి విజయవాడకెళ్ళే బస్సు తాడేపల్లిగూడెం కాలవగట్టు స్టాపులోకి వచ్చి ఆగింది. డ్రైవరు దిగాడు. కండక్టరు కూడా దిగుతూండగా ఎవరో "ఇక్కడ బస్సు ఎంతసేపు ఆగుతుందండీ?" అని అడిగారు. కండక్టరు, "పది నిముషాలు ఆగుతుంది. కాఫీ తాగి రావచ్చు" అని చెప్పి దిగాడు. బస్సు కండక్టరు ముందువైపుకు నడిచి, రోడ్డుదిగి, గుడిసెల్లోకి వెళ్ళి మాయమయ్యాడు. కాఫీ తాగాలనుకున్న ప్రయాణీకులు ఓ అరడజను మంది కూడా దిగారు. వాళ్ళు దిగీ దిగ్గానే ఓ పది పన్నెండుమంది కొత్తగా లోపలికి ఎక్కారు. ఆ ఎక్కిన వాళ్లలో వయస్సు వచ్చిన ముగ్గురు ఆడపిల్లలు కూడా ఉన్నారు.

కండక్టరు చెప్పిన పది నిముషాలవ్వగానే దిగిన వాళ్లంతా ఒక్కొక్కరుగా వచ్చి బస్సు ఎక్కారు. ఇంకొంచెం సేపటికి కండక్టరు వచ్చాడు. వస్తూనే టిక్కెట్ల హాండిల్ అందుకొని, "టికెట్" అంటూ సీట్ల మధ్యకు వచ్చాడు. అంటూనే హడావుడిగా ముందుకు నడుస్తూ మళ్లీ, "టికెట్ ప్లీజ్, టికెట్" అన్నాడు. కొత్తగా ఎక్కిన వాళ్లు చాలామంది చిత్రంగా ఏలూరు, ఆపై ఊళ్లకు వెళ్లేవాళ్లే! వాళ్లలో చాలామంది ఐదు, పది రూపాయల నోట్లు తీస్తారు కండక్టరు ఒక్కొక్కళ్లనీ ఊరడుగుతూ, అందరి దగ్గరా డబ్బు తీసుకున్నాడు. పోగయిన నోట్లు పట్టుకొని, తన సీట్లో కూర్చుని, జేబులు తడుముకొని, ఆశ్చర్యం ప్రకటిస్తూ లేచి నుంచుని, "అరెరె, ఆయన దగ్గర పంచి పుచ్చుకోవటం మర్చిపోయానే"అంటూ టికెట్ల హాండిల్‌ను రాక్‌లో పడవేసి, లేచి, దిగబోయాడు

వెనకాల నుంచి ఎవరో, "మాకు టిక్కట్లిచ్చి వెళ్లిపొండి" అన్నారు. కండక్టరు, "మళ్లీ వచ్చి ఇస్తాను. పంచి తెచ్చుకోవాలి" అంటూ దిగి వెళ్లిపోయాడు. పది నిముషాలు గడిచాయి. డ్రైవరూ, కండక్టరూ వచ్చి బస్సు ఎక్కారు. కండక్టర్ టిక్కెట్ల హాండిల్ తీసుకుని, "టికెట్, టికెట్" అంటూ లోపలికి నడిచాడు. కండక్టరు సీటు వెనకాల సీట్లో కూర్చొనున్న ఇందాకటి యువకుడు, "మీరే మాకు టిక్కెట్లివ్వాలి" అన్నాడు. "డబ్బుల్తియ్యండి, ఇస్తాను" అన్నాడు కండక్టరు. "అదేంటి, ఇందాకన అందరి దగ్గరా డబ్బులు తీసికెళ్లినప్పుడు మళ్లీవచ్చి టిక్కెట్లిస్తానన్నారు గదా మీరు." కండక్టరు మొహంలో చిరాకు తొంగిచూసింది. "ఏంటండీ మీరు చెప్పేది? మీరు ఎవరికిచ్చారు? ఎవరు తీసుకెళ్లారు? కాఫీ తాగి ఇప్పుడే కదా నేను వస్తోంది! బాగా జ్ఞాపకం తెచ్చుకోండి, ఎవరికిచ్చారో...... టిక్కెట్ ప్లీజ్, టికెట్.... డ్రైవరుగారూ, పోనివ్వండి, పోనివ్వండి," కండక్టరు పంచితో బస్సు కడ్డీ మీద చప్పుడు చేశాడు.

యువకుడు తెల్లబోయాడు. అతను ఏదో మాట్లాడేలోపల వెనకాల సీట్లల్లో నుంచి ఇద్దరు స్థూలకాయులు, తాము కూడా అంతకుముందే పదేసి రూపాయలిచ్చామనీ, ఆ వచ్చిన కండక్టరు కూడా అచ్చం ఇతనిలాగానే ఉన్నాడనీ, మళ్లీ వచ్చి టిక్కెట్లిస్తానన్నాడనీ, అతని దగ్గర కూడా 'కాష్ బాగ్' ఉన్నదనీ అన్నారు. కండక్టరు చిరాగ్గా చూస్తూ "మీరు ఎవరికో డబ్బిచ్చి నన్ను టిక్కెట్లిమ్మంటే ఎట్లా ఇచ్చేది? మీరు చేసిన పొరబాటుకు నా చేతి చమురు వదలాలంటారా ఏంటండి?" వాళ్లిద్దరూ మొహాలు మొహాలు చూసుకుంటూ కూర్చుండిపోయారు.

బస్సులో కలకలం బయల్దేరింది. తను టిక్కెట్ తీసుకొని డబ్బిచ్చి ఉండవలసిందని ఒకరూ, ప్రపంచంలో మోసం, అన్యాయం పెరిగిపోయాయని ఒకరూ, ఎవరో వచ్చి మోసం చేస్తే ఈ కండక్టరుకుశిక్ష వెయ్యటం అన్యాయమని ఒకరూ, ఇట్లా రకరకాలుగా వ్యాఖ్యానించటం మొదలు పెట్టారు. "టికెట్, టికెట్" అని అరుస్తూ కండక్టరు చెయ్యి చాచాడు. మళ్లీ డబ్బివ్వక తప్పదనుకున్నారు కాబోలు, వెనకాల సీట్లల్లో వాళ్లు నలుగురు డబ్బులిచ్చారు. టిక్కెట్లు పుచ్చుకున్నారు. కండక్టరు ఆడవాళ్ల సీట్లవైపు వైపు తిరిగి, ముందరి సీట్లోకి కొత్తగా వచ్చి ఎక్కిన ముసలమ్మను, "మామ్మా, టికెట్!" అన్నాడు. అరవైఏళ్ల ఆ ముసలమ్మ కండక్టరువైపు చూసి "ఇందాకనే గదూ నాయనా టిక్కెట్టుకు ఐదు రూపాయలిచ్చాను!" అంది... "నా కెక్కడిచ్చావు? ఎవడికో ఇచ్చుంటావు. తియ్, తియ్!" అన్నాడు కండక్టరు.

ముసలమ్మ గొంతులో దీనత్వం చోటుచేసుకోగా అంది : "నాయన్నాయన, అట్లా అనకు బాబూ! నా దగ్గరింక డబ్బుల్లేవు. కావలిస్తే పదిపైసల్లీసుకో. నన్ను మాత్రం దింపెయ్యకు."... "డబ్బుల్లేవంటే ఎట్లా? లేకపోతే దిగాల్సిందే! దిగు, దిగు" అంటూ కండక్టరు, ఆ వెనక సీట్లో కూర్చునున్న ముగ్గురు అమ్మాయిల దగ్గరకు వచ్చి చెయ్యి చాపాడు. వాళ్లల్లో ఊలీ-ఊలీ చీరలో అందంగా, అధునాతనంగా ఉన్న అమ్మాయి, "ఇందాకనే మా ముగ్గురికీ కలిపి ఇరవై కాగితం ఇచ్చాను. టిక్కెట్లివ్వటం ఆలస్యం మీదే" అన్నది... "మళ్లీ మొదలా, మీరెవరికెచ్చారో నాకు తెలీదు. ఇప్పుడు నాకిస్తే ఇవ్వండి. లేకపోతే దిగిపొండి!" కండక్టరు కంఠంలో కరుకుదనం ధ్వనించింది. ఆ అమ్మాయి బతిమాలుతున్న ధోరణిలో అంది : "అదేంటండి, ఉత్తప్పుడల్లా మీరు 'ప్రజాసేవ' చేస్తున్నట్టు చెప్పుకుంటారుగదా, ఇప్పుడు వాడెవడో ఇంతమందినీ మోసంచేసి డెబ్భై, ఎనభైరూపాయలు పట్టుకెళ్లిపోతే మీరు మాకు సహాయం చెయ్యరా? ఆచూకీ తీసేందుకు ప్రయత్నించరా? మీకేం పట్టనట్టు 'డబ్బుల్తియ్యి, తియ్యి' అంటే ఎక్కడ్నుంచి తీస్తాం చెప్పండి! పైగా మేం స్టూడెంట్లం. ఇవ్వాళ మా కాలేజీ హాస్టల్లో ప్రెజెంట్ కాకపోతే మేము చాలా నష్టపోతాం.

మా దగ్గర డబ్బులూ అంతంత మాత్రంగానే ఉన్నాయి''

''ఏంటమ్మా మీరు చెప్పేది? నన్ను ఈ ఉద్యోగం మానేసి ఇంకో ఉద్యోగం చెయ్యమంటారు, అంతేనా? అసలు నాకూ వాడికీ సంబంధమేమిటి? చాలు చాల్లేవమ్మా!..... పోనీవయ్యా డ్రైవరుగారూ, ఇప్పటికే పావుగంట ఆలస్యమయింది.'' కండక్టరు మళ్లీ పంచితో చప్పుడు చేసాడు. ఆ అమ్మాయి వదిపెట్టలేదు. కొంచెం తీవ్ర స్వరంతోనే అడిగింది. ''సంబంధం లేకపోవట మేమిటండి, అతనూ మీ చొక్కాలాంటి కాకీచొక్కానే వేసుకున్నాడు. ఈ బాగ్‌లాంటి లెదర్ బాగ్‌నే తగిలించుకున్నాడు. అతను వచ్చి డబ్బడిగితే మేము ఎట్లా ఇవ్వక పోవాలి?'' ... '' కాకీ చొక్కాలూ, లెదర్‌బాగ్‌లూ వందలకొద్దీ దొరుకుతాయి బజార్లో. అవన్నీ నావేనంటారా? చాల్చాలు మీరెట్లాగూ టిక్కెట్లు కొనేటట్లు లేరు, దిగండి.'' ఇంతవరకూ ఈ భాగోతం ఏమీ అర్థంగాక అయోమయంగా చూస్తూ కూర్చున్న డ్రైవరు బస్సు స్టార్ట్ చేసాడు.

ఆ అమ్మాయి హఠాత్తుగా ''డ్రైవరుగారూ!'' అని పిలిచింది. డ్రైవరు వెనక్కు తిరిగి చూసాడు. ''ఇట్లా ఒకసారి రండి.''... డ్రైవరు 'ఏమిటి?' అన్నట్లు తల ఎగరవేసాడు... ''ప్లీజ్, ఒకసారి రండి!''.... డ్రైవరు ఇంజను ఆపుచేసి, లేచివచ్చాడు. మెరుపులాగా ఆ అమ్మాయి అతన్ని దూసుకుని వెళ్లిపోయి డ్రైవరు సీట్లో స్టీరింగు చక్రానికి వెన్ను ఆనించి కూర్చుండిపోయింది. అంది- ''మా ముగ్గురికీ విజయవాడకి టిక్కెట్లు కొనిస్తేనేగాని బస్సు కదల్నియ్యను.'' కండక్టరు ఉగ్రుడైపోయాడు. ''ఏవమ్మోయ్, తమాషాగా ఉందేమిటి? కుర్రతనం పన్లుమానేసి బస్సుదిగు. నీ కసలు చస్తే టిక్కెట్టివ్వను.''.... ''నేను దిగను. నేను మీకు డబ్బిచ్చాను. టిక్కెట్లివ్వండి... అయినా, కుర్రతనం అంటారేంటి? మాటలు జాగ్రత్తగా రానీండి. కొరివితో తల గోక్కోవటం మీకు మంచిదికాదు. మేము పాతకాలపు ఏడుస్తూ కూర్చునే ఆడపిల్లలం కామనీ, మోరోవర్, స్టూడెంట్లమనీ జ్ఞాపకముంచుకోండి.''

కండక్టరు మొహం కోపంతో కందగడ్డలాగా అయింది. విసురుగా డ్రైవర్‌తో, ''బీట్ కానిస్టేబుల్‌ను తీసుకురండి,'' అన్నాడు. డ్రైవరు బస్సుదిగి వెళ్లాడు. బస్సులో కొత్త కలకలం సన్నగా మొదలైంది. వెనకాల సీట్లోంచి ఒక వయస్సు మళ్లినాయన, ''ఏంటమ్మాయ్, గోల! మాకు మాత్రం డబ్బులు పోలేదా ఏంటి? ఏదో సర్దుకుపోవాలి. ఎన్నో అన్యాయాలు జరుగుతున్నాయి. అవన్నీ మనం సర్దుబాటు చెయ్యగలమా? చూసీచూడనట్టు వాటిని భరిస్తూ పోవాలి. అంతే'' అన్నాడు. అమ్మాయి అతనివంక అనునయంగా చూసి, అంది : ''పెద్దవారు మీరే అట్లా అంటే ఎల్లాగండి! వాడెవడో వచ్చి మనల్నందర్నీ ఫూల్స్ చేసి వెళ్లిపోయాడు. ఈయన కనీసం ఎంక్వయిరీ అయినా చెయ్యకుండా తనకేం పట్టనట్టు ఊరుకుంటున్నాడు. పై పెచ్చు హడావుడిగా 'బస్సు పోనీ, పోనీ' అంటున్నాడు. మీరు కూడా ఆయన్నే సపోర్టు చేస్తున్నారు. ఒకవేళ నా ప్రాణానికే హాని జరిగి ఉండినా ఇంతే గదా. ఇంతమందిలోనూ ఎవరూ పట్టించుకొనేవారు కాదు గదా!'' ఆ వయసు మళ్లినాయన మాట్లాడలేదు. మొహం వంచేసాడు. కండక్టరు తాలూకు ఎగశ్వాస దిగశ్వాసల్లో ఆవేశం తీవ్రమైంది. అందరివైపూ చూస్తూ అన్నాడు : ''చూసారా, చూసారా, ఎవరెవరో వచ్చి ఆవిడమీద పడిపోయినట్టు ఎట్లా మాట్లాడుతోందో! అసలీ అమ్మాయి మగనాలిగాని ఆడమనిషి కాదండి,' '... ఎవరో సన్నగా నవ్వారు. గొంతులో పౌరుషం ఉట్టిపడగా అమ్మాయి అంది : ''ఆఁ ఆఁ, రైట్, మగాళ్లు మగతనం వదిలేసుకున్నప్పుడు ఆడాళ్లయినా మగాళ్లు కావద్దా? అది ఆనందించవలసిన విషయమే గదా!''

కొంతమంది మొహాలు మొహాలు చూసుకున్నారు. ఇందాకటి యువకుడు అమ్మాయితో అన్నాడు : "మీ మాటలు చూస్తే ఈ కండక్టరే మోసం చేసాడని మీరనుకుంటున్నట్టు తెలుస్తోంది. అంతేనా?".... "ఇతనే చేసాడని అననుగానీ, చూడగా చూడగా ఇతనికి తెలియకుండా మాత్రం అది జరిగి ఉండదనినిపిస్తోంది. ఎందుకంటే, ఇదే లెదర్‌బాగ్,.. "హఠాత్తుగా కండక్టరు అందుకున్నాడు : "అనుమానాల్తో కేసులు నడవ్వు. ఋజువు, ఋజువు చెయ్యాలి.".

యువకుడు నవ్వాడు : "నిజమే, దీంతో ఈయనకి సంబంధముందని మీరు ఋజువు చెయ్యగలరా?".... "మాష్టారూ ఇది మన అందరికీ సంబంధించిన విషయం మనందరం తలుచుకొంటే నిజాన్ని బయటకు తియ్యటం కష్టం కాదు. నన్నొంటరిదాన్నిచేసి ఋజువు చెయ్యమంటే ఎట్లా?.... అయినా ప్రయత్నిస్తాను," అని అంటూ రుమాల్తో ఒకమాటు మొహం తుడుచుకొని, అందరివైపూ చూస్తూ అంది : "మాస్టారూ మీరెవరైనా ఇందాకన మీరిచ్చిన నోట్లను గుర్తుపట్టగలరా?" అందరూ మొహాలు మొహాలు చూసుకున్నారు. నెమ్మదిగా ఒకాయన లేచి నుంచున్నాడు. ఆయన బహుశా వ్యాపారి అయ్యుండవచ్చు. ఆయన అన్నాడు : "నా దగ్గర ఇందాకన ఐదు కొత్త పది కాగితాలు ఉన్నాయి, అవి పొద్దున బాంకు వాళ్లిచ్చినవే. వాటిల్లో ఒకటితీసి టిక్కెట్టుకు ఇచ్చాను. చూస్తానాగండి," అంటూ తన లాల్చీ జేబులోంచి పది రూపాయల కాగితాలు తీసాడు. అవి నాలుగు. అన్నీ కొత్తవీ, వరస నెంబర్లవీను.! "వీటిల్లో పై నెంబరుదో కింది నెంబరుదో అయ్యుండాలి అది" అన్నాడు.

అమ్మాయి లేచి కండక్టరు దగ్గరికి వచ్చింది. వ్యాపారి కూడా వచ్చాడు. యువకుడు లేచి నుంచున్నాడు "డబ్బు తియ్యండి" అన్నాడు కండక్టరుతో. కండక్టరు ముగ్గురివంకా కొరకొరగా చూసాడు. లెదర్ బాగ్‌లోనుంచి నోట్లబొత్తిని తీసాడు. వ్యాపారి టక్కున తన కొత్త నోటును గుర్తుపట్టి, "అదిగో, ఆ నెంబరే!" అన్నాడు. కండక్టరు చటుక్కున "అది ఇందాకన హోటల్లో నేను ఇరవై రూపాయలనోటు మార్చినపుడు నా చేతిలోకి వచ్చిన నోటు. మీదెల్లా అయింది. చాలు, చాలు పదండి," అన్నాడు. ముగ్గురూ నిర్ఘాంతపోయారు. డ్రైవరూ, పోలీసూ వచ్చారు. బస్సెక్కారు.

కథ ఇక్కడ గమ్మత్తుగా కొత్తమలుపు తిరిగింది.

ఇందాకటి ముసలమ్మ ఒళ్ళో కూర్చొనున్న ఆరేళ్ల కుర్రాడు కండక్టరు తొడుక్కున్న కాకీ చొక్కావైపు చూపిస్తూ "మామ్మా, అదిగో చీమిడి" అన్నాడు. ముసలమ్మ ముందుకువంగి, కండక్టరు వీపువైపు చొక్కాకు అంటుకుని చిక్కగా, ఇంకా తడిగా ఉన్న చీమిడిని చేత్తో తియ్యబోయింది. కండక్టరు ఆ స్పర్శకు వెనక్కు తిరిగాడు. "ఏంటది?" అన్నాడు. కుర్రాడు "నా చీమిడి, ఇందాక నువ్వొచ్చావూ, అప్పుడు మామ్మ నాముక్కు చీమిడి తీసి పారేసింది. అదుగో అక్కడ పడింది. నువ్వెళ్లిపోయావుగా. అందుకనే.... తియ్యలేదు," అన్నాడు.

కండక్టరు : "ఇందాకన నేను వచ్చానా? ఎవఁడ్రా నువ్వు రాస్కెల్!"

కుర్రాడు : "నువ్వే, నువ్వే. అది నా చీమిడే."

యువకుడు, అమ్మాయి మొహాలు మొహాలు చూసుకున్నారు. హఠాత్తుగా అమ్మాయి డ్రైవరువైపు చూస్తూ అతన్ని అడిగింది : "డ్రైవరుగారూ, ఇందాకన మీరు ఈయన్తో కలిసే కాఫీ తాగారా?" డ్రైవరు అయోమయంగా చూసాడు. "లేదే, నేను ఒక్కణ్ణే సెంటర్లోకి వెళ్లి కాఫీ తాగాను. ఈయన రోడ్డుకింది టీకొట్టు వైపు వెళ్ళినట్టున్నాడు. సరిగ్గా చూళ్లేదనుకోండి. అయినా ఇప్పుడా విషయం ఎందుకులెండి."

అమ్మాయి ఆనందంతో అరిచింది : "ఆఁ తెలిసిపోయిందండి. కండక్టరుగారు ఒంటరిగా చాటుకు ఎక్కడికోవెళ్లి తన పోలికలున్న వాడికెవడికో తన చొక్కా, లెదర్‌బాగూ ఇచ్చి పంపించాడు. వాడు వచ్చి మనల్ని మోసం చేసాడు. ఆ లాభాన్ని ఇద్దరూ పంచుకొని ఉంటారు." కండక్టరు, నూతిలోనుంచి వస్తున్నట్లున్న హీనస్వరంతో "అబద్ధం, అంతా అబద్ధం" అన్నాడు. అమ్మాయి, జరిగిందంతా పోలీసుకు చెప్పింది. పోలీసు, బస్సును ఉన్నపళంగా పోలీసు స్టేషనుకు తీసుకువెళ్లాలన్నాడు. ఎవరో ఇద్దరు, అప్పటికే చాలా ఆలస్యమైందనీ, స్టేషనుకు వెళ్లటం అనవసరమనీ, విషయాన్ని అక్కడితో వదిలేసి బస్సును బయల్దేరదీయటం మంచిదనీ అన్నారు.

అమ్మాయి అంది : "మాష్టారూ, ఇంతసేపు ఓపిక పట్టారు ఇంకొంచెం సేపు పట్టలేరా? అన్యాయం జరుగుతున్నదని తెలిసి, దాన్ని కనిపెట్టిన తరవాత కూడా మనం ఉపేక్షించటం ఎంతవరకు సమంజసం? కొన్ని నిమిషాలకిందట ఈ కండక్టరు మనల్ని నీచంగా డబాయిస్తొంటే అతన్ని ఎదుర్కొనలేకపోయాము. కారణం, మనలో ఎవరికీ, అన్యాయాన్ని ఒంటరిగా ఎదుర్కొనే శక్తి లేకపోబట్టేగదా! ఇప్పుడితను దొరికిపోయాడు. కనీసం ఇప్పుడయినా మనందరం కలిసి సామూహిక శక్తిని ప్రదర్శిద్దాం రండి. ప్రభుత్వాన్నే మార్చగలిగిన మనం సామూహికంగా సాక్ష్యం ఇచ్చి నేరస్థుడికి బుద్ధి చెప్పించలేమా? మన డబ్బూ మనకు వస్తుంది కద!.... దయచేసి నామాట కాదనకండి. బస్సును పోలీసు స్టేషనుకు పోనిద్దాం పదండి" - అందరికీ చేతులు జోడించి నమస్కారం పెట్టింది అమ్మాయి.

యువకుడు ఆలోచన్లోంచి తేరుకొని నెమ్మదిగా అన్నాడు : "యస్, యస్, మీరన్నదీ పాయింటే. మనందరం తలుచుకుంటే చెయ్యలేందేముంది? స్టేషనుకే పోనియ్యండి." మిగతా ప్రయాణీకుల్లో కొందరు "అవునవును" అన్నారు. కానీ ఎవ్వరూ ఒద్దనలేదు. అంతకుముందు వద్దన్నవాళ్లు కూడా నిశ్శబ్దంగా ఉండిపోయారు. రెండో నిముషంలో బస్సు వెనక్కి తిరిగి, ఓవర్ బ్రిడ్జి ఎక్కి, పోలీసు స్టేషన్ వైపు తిరిగింది!

" ఈ పోలీసువాళ్ళతో ఇంకో రెండుగంటలు లేటా! ఎందుకొచ్చిన గోల. నా జీతంలో కోత పెట్టుకొని వీళ్ళకు టిక్కెట్లిస్తాగానీ, బస్సుని రూట్‌లోకి తిప్పండి డ్రైవరుగారూ" అంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ రాజీకొచ్చేశాడు కండక్టరు.

(ఆంధ్రపత్రిక ఉగాది సంచిక ఏప్రిల్ 78)

★★★ ★★★ ★★★